క్లుప్తంగా

జగ్జీవన్‌రాం ఆశయాలను కొనసాగిద్దాం



అమరచింత: జగ్జీవన్‌రాం ఆశయాలను కొనసాగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి అన్నారు. ఆత్మకూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న ఖాళీస్థలంలో ఆదివారం జగ్జీవన్‌రాం విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. త్వరలో విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆనాడు దేశ సౌభాగ్యం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను అర్పించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, పీఏసీఎస్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రేపు కొమిరెడ్డిపల్లిలో కబడ్డీ టోర్నమెంట్

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లిలో ఈనెల 28న హనుమాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీ సంతోషి, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, యువజన సంఘం అధ్యక్షుడు గణేష్‌గౌడ్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.20,116, రెండో బహుమతి రూ.15,116, మూడో బహుమతి రూ.10,116లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 9390618034 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం



బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని ఆవంచలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్వామి వారికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద పండితులు వంశీ కేశవాచారి వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు గోవింద నామ స్మరణతో మార్మోగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, కుచుకుళ్ల రాజేష్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు తప్పనిసరి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని వ్యాపార సముదాయాలు, ప్రైవేటు, ప్రభుత్వ స్కూళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐ అనుదీప్ కోరారు. ఆదివారం ఆయా పాఠశాలలు, వ్యాపార సముదాయ యజమానులతో మాట్లాడారు. దుకాణాల లోపలి భాగంతో పాటు బయట ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ద్వారా సులువుగా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక శిబిరాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దత్తత గ్రామాల్లో త్వరలోనే ప్రత్యేక శిబిరాలు ప్రారంభించనున్నట్లు పీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా.కె.ప్రవీణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబగద్వాల, వనపర్తి జిల్లాలలో వచ్చే నెలాఖరు వరకు 25–30 శిబిరాలు కొనసాగుతాయన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో వేసవి ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో క్యాంపు కార్యకలాపాలతో పాటు 15–29ఏళ్లలోపు గల ఉపాధిలో లేని యువతకు సంబంధించి సర్వే చేపడతామన్నారు. అలాగే వలంటీర్లకు ప్రోగ్రాం ఆఫీసర్లు శిక్షణ ఇస్తారన్నారు.

స్నేహితులకు చేయూత

దేవరకద్ర రూరల్: మండలంలోని మీన్గోనిపల్లికి చెందిన ప్రదీప్ వారం రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. 2003–04లో దేవరకద్ర బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న స్నేహితులందరూ కలిసి రూ.65వేలను పోగుచేసి ఆదివారం ప్రదీప్ భార్యకు అందజేశారు.

కౌకుంట్లలో..

కౌకుంట్ల మండలానికి చెందిన బాలమణి కొన్ని రోజుల కిందట ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుంది. 1991–92లో కౌకుంట్లలో చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలిసి రూ.30వేలు జమచేసి అందజేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ–కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఫౌండర్, సీనియర్ కరాటే మాస్టర్ కె.వెంకటేశ్ తెలిపారు. ఈ పోటీల్లో కటాస్‌లో భావేష్, యశ్వంత్, జామ్ శివశంకర్‌లు మొదటి స్థానంలో, సంతోష్ రెండోస్థానంలో నిలిచి పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను మాస్టర్ వెంకటేశ్ అభినందించారు.

రోడ్డు పనులు సాగేనా?



పర్వతాపురం రోడ్డు పరిస్థితి..

- రోడ్డు, బ్రిడ్జి పనులకు రూ.5.90 కోట్లు మంజూరు
- టెండర్లు పూర్తయినా ప్రారంభం కాని పనులు
- ఆందోళనలో మూడు గ్రామాలు, తండాల ప్రజలు

ఖిల్లాఘనపురం: పల్లె ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అప్పారెడ్డిపల్లి నుంచి పలుగ్రామాలు, గిరిజన తండాలను కలుపుతు కర్నెతండా మీదుగా నేరుగా వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు వీలుగా పీఎంజీఎస్‌వై పథకం ద్వారా మంజూరైన రోడ్డు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.5.90 కోట్ల నిధులు

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి పర్వతాపురం, గార్లబండతండా మీదుగా ఆముదంబండ తండా మలుపు వరకు బీటీ రోడ్డుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో పాటు మధ్యలో అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం మధ్యలో ప్రవహిస్తున్న పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి, రోడ్డుకు మొత్తం రూ.5.90 కోట్ల నిధులు మంజూరయ్యాయి.



పెద్దవాగుపై వంతెన నిర్మించే ప్రాంతం

నిరాశలో ప్రజలు

అప్పారెడ్డిపల్లి నుంచి ఆముదంబండతండా రోడ్డు వరకు 7.3 కిలోమీటర్ల పొడువునా ప్రభుత్వం బీటీ రోడ్డు వేస్తుందన్న విషయం తెలియడంతో అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం, గార్లబండతండా, ఆముదంబండతండా, కర్నెతండా ప్రజల ఆనందం వ్యక్తం చేశారు. తీరా ఏళ్లు గడుస్తున్నప్పటికీ పనులు ప్రారంభంకాకపోవడంతో నిరాశలో పడిపోయారు.

రోడ్డు పనులు చేసేలా చూడాలి



అప్పారెడ్డిపల్లి నుంచి మా గ్రామం మీదుగా అడవి బాట వెంట గార్లబండతండా వరకు ఉన్న వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. ఈ మట్టి రోడ్డు కాస్త బీటీ రోడ్డుగా మారుతుందని తెలియడంతో ఇబ్బందులు పోయాయని అనుకున్నాం. ఈ రోడ్డు పూర్తయితే నేరుగా తక్కువ సమయంలో వనపర్తికి వెళ్లొచ్చు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు.

– గోవర్ధన్‌రెడ్డి, పర్వతాపురం

ఉన్నతాధికారులకు తెలిపాం



అప్పారెడ్డిపల్లి నుంచి పర్వతాపురం, గార్లబండతండా మీదుగా ఆముదంబండతండా వరకు 7.3 కిలోమీటర్ల రోడ్డుకు, అప్పారెడ్డిపల్లి–పర్వతాపురం శివారులో బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. రోడ్డుకు టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యింది. కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– కబీర్‌దాస్, పీఆర్ ఏఈ

కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట: కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలమని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళన సమావేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ దేశానికి శ్రీరామరక్ష అని, ఆయన ముందుచూపుతోనే ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. జాతరలను మరిపించేలా ఆత్మీయ సమ్మేళనం ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమ్మేళనంతో నాయకులు, కార్యకర్తల మధ్య అనుబంధం బలోపేతం అవుతుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కులాలు, మతాల మధ్య చిచ్చు రగిల్చే ప్రయత్నాలు చేసేందుకు కొందరు వస్తారని, వారిని నమ్మవద్దని ఆయన కోరారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ రాజ్యం: ఎమ్మెల్యే

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ రాజ్యం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు మరెక్కడా అమలు కావడం లేదన్నారు. సమ్మేళనానికి భారీ మొత్తంలో కార్యకర్తలు, నాయకులు, మహిళలు రావడం సంతోషకరమన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను పార్టీ శ్రేణులంతా ఎక్కడికక్కడా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. 60 లక్షలకు పైగా సభ్యత్వం ఉన్న పార్టీ బీఆర్‌ఎస్ అని గుర్తు చేశారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే దంపతులు కార్యకర్తలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ మౌనిక, సింగిల్ విండో చైర్మన్ వంశీధర్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుఖేశిని, విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో దేశం అప్రతిష్టపాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

వీపనగండ్ల: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను, ప్రజాప్రతినిధులను ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశప్రతిష్టతకు భంగం వాటిల్లుతుందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పుల్గర్‌చర్లలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలని కుట్ర చేస్తున్న బీజేపీకి ప్రజలచే భంగపాటు తప్పదన్నారు. అసత్య ఆరోపణలను మానుకుని ప్రజాక్షేత్రంలో బలబలాలు తేల్చుకోవాలని అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో రెవెన్యూ డివిజన్‌తో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవాలని చూసిన వారు నేడు అసత్యమాటలతో ప్రజల ముందుకు రావడం సిగ్గుచేటని అన్నారు. కరోనాతో కొంత కాలం అభివృద్ధి నిలిచినా దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామన్నారు. పుల్గర్‌చర్లలో మహిళా, హమాలీ సంఘ భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేస్తామని, శ్రీరంగాపూర్ వరకు డబుల్ బీటీ రోడ్డు పనులు త్వరలో ప్రారంభం అవుతాయన్నారు. గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన 100 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, సర్పంచ్‌లు అరుణమ్మ, రఘునాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్, రామేశ్వర్ రావు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌లో వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడాన్ని హర్షిస్తూ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల కేంద్రం నుంచి వయా శాగాపూర్, కదిరెపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణం, పాఠశాల సమీపంలో బ్రిడ్జినిర్మాణం కోసం రూ.3 కోట్లు, కేఎల్ఐ కాల్వ నుంచి తిరుపతయ్య చెరువు నింపేందుకు మినీ లిఫ్టు కోసం రూ.15 లక్షలు, గ్రామంలో సీసీ రోడ్లు, రైతుల పంట పొలాలకు వెళ్లేందుకు అవసరమైన రోడ్డుకు నిధులు మంజూరు చేయడం హర్షించదగిన విషయం అన్నారు.



పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

టాలెంట్ టెస్ట్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఏఎంఓ

నారాయణపేట రూరల్: జిల్లా స్థాయిలో నిర్వహించిన పూసల్‌పహాడ్ టాలెంట్ టెస్ట్ ఫలితాలను నిర్వాహకులు శేర్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం డీఈఓ కార్యాలయంలో ఏఎంఓ విద్యాసాగర్ చేతులమీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా ఈ ప్రాంత విద్యార్థుల ప్రతిభ వెలికి తీసేందుకు కృషి చేస్తుండడాన్ని అభినందించారు. మొదటి మూడు స్థానాల్లోని విద్యార్థులకు నగదు బహుమతులు, టాప్ 20 విజేతలు, పాఠశాలల వారీగా టాపర్‌లకు ప్రశంసా పత్రాలు బుధవారం జిల్లాకేంద్రాలో అందజేయనున్నారు. దీంతో పాటు పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తారని వివరించారు. తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహా, కోశాధికారి కిశోర్, ఉపాధ్యాయులు సురేష్, నాగార్జున్‌రెడ్డి, బసిరెడ్డి, తిరుపతయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గుర్నాథ్‌రెడ్డి, కుర్మయ్య, శ్రీనాథ్, విశ్వేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజేతలు వీరే...

టాలెంట్ టెస్ట్‌లో 115మార్కులతో మక్తల్ పట్టణంలోని కృష్ణవేణి స్కూల్ విద్యార్థిని మంజుల ప్రథమ స్థానంలో నిలిచింది. 110 మార్కులతో నారాయణపేట లిటిల్‌స్టార్స్ స్టూడెంట్ సకేనా ఫాతిమా రెండో స్థానంలో, 109 మార్కులతో రవితేజ స్కూల్ చిన్నారి అక్షయ మూడోస్థానంలో నిలిచారు.

బహిరంగసభను జయప్రదం చేయండి



రేమద్దులలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాన్‌గల్: సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే జన చైతన్య యాత్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. వాల్ పోస్టర్లతో ఆదివారం మండలంలోని రేమద్దులలో ప్రచారం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాదం, కార్పొరేట్ సంస్థలకు మేలు చేకూర్చే అంశాలతో ప్రజలపై పెను భారాలు మోపుతున్నారనే విషయాలను ప్రజలకు తెలియపరుస్తూ వారిని చైతన్యం చేసేందుకు యాత్రలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, వెంకటయ్య, ఖాజా, మల్లేష్, నిరంజన్, కమలాకర్, భాస్కర్‌గౌడు, బుడ్డయ్య, రాంబాబు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని స్థానిక సుభాష్ చౌరస్తాలో జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఆదివారం సీపీఎం నాయకులు పోస్టరు విడుదల చేశారు. మండల కన్వీనర్ రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ, దేశంలో మతోన్మాద విధానాలు అమలు చేస్తుందని విమర్శించారు. 28న వనపర్తి జిల్లా కేంద్రం, 29న హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున బహిరంగ సభకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలయ్య, పెద్ద ఖాజా, దేవన్న, ఆంజనేయులు, వెంకటేష్, భీముడు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గోపాల్‌పేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థులు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2002–03 సంవత్సరంలో పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు అప్పట్లో వారు ఎదుర్కొన్న పరిస్థితులు, ఉపాధ్యాయుల సూచనలు వంటి పరిస్థితులను నెమరవేసుకున్నారు. అనంతరం ఉపాధాయులను సన్మానించారు.



వెల్టూర్ జెడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వెల్టూర్ జెడ్పీహెచ్ఎస్ 1998–99లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనాన్ని నిర్వహించారు. 25ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఎంతో ఆనందంగా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ఇతర సామగ్రిని అందజేశారు.

నేటి మండల సభ వాయిదా

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ కతలప్ప ఆదివారం తెలిపారు. తదుపరి తేదీలను తిరిగి ప్రకటిస్తామని ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు గమనించాలని ఆయన కోరారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

అమరచింత: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిస్తున్న మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనానికి కార్యకర్తలు తరలిరావాలంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ ,పట్టణ అధ్యక్షుడు నరసింహులుగౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని నరేష్‌రెడ్డి ఫాంహౌస్‌లో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పాన్‌గల్: మండల కేంద్రంలో నిర్మిస్తున్న సీతారామాంజనేయ ఆలయ నిర్మాణంలో యువతను భాగస్వామ్యం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు రవికుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. భాగస్వామ్యం అయిన యువత ఒక్కొక్కరు ఆలయ నిర్మాణానికి రూ.10వేల చొప్పున విరాళం అందజేస్తారని వారు పేర్కొన్నారు. అందులో భాగంగానే శివకుమార్, రాజేష్ రూ.20 వేల చెక్కులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఉచిత వైద్యసేవలు

అమరచింత: తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యసదుపాయాలు పొందవచ్చని సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకుడు పృథ్వీనాగలింగేశ్వర్ తెలిపారు. పట్టణంలోని రజక వీధిలో ఆదివారం పథకం ద్వారా కార్డు పొందేందుకు దరకాస్తులను స్వీకరించారు.

కిరాణ దుకాణంలో చోరీ.. కేసు నమోదు

తెలకపల్లి: మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తా సమీపంలోని ఓ కిరాణ దుకాణంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు తాళాలు పగలగొట్టి రూ.25 వేల నగదుతో పాటు, సిగరెట్ ప్యాకెట్లను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులు కిరాణ దుకాణాన్ని సందర్శించి పరిశీలించారు. కిరాణ దుకాణం యజమాని సాయి ప్రసాద్ ఆదివారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అంజయ్య తెలిపారు.

ఘనంగా సప్తాహ మహోత్సవాలు



దేవరకద్ర: మండల కేంద్రంలో వెలసిన ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో ఆదివారం 94వ సప్తాహ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎంతో ప్రసిద్ధి చెందిన పురాతన శివాలయం, వీరప్పయ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామి వారి పల్లకీసేవ కార్యక్రమం అనంతరం సప్తాహ మహోత్సవాలను ప్రారంభించారు. వారం రోజుల పాటు అఖండ భజనలు కొనసాగిస్తారు. వందల సంవత్సరాల చరిత్ర ఉన్న శివాలయం సమీపంలోనే వీరప్పయ్యస్వామి మఠం ఉంది. ఉత్సవాల్లో పలువురు మహిళలు సేవా కార్యక్రమాలలో పాల్గొనడానికి ముందుకు వచ్చారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ శివానంద్, ఈఓ కోమల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కురుమూర్తి స్వామి ఆలయంలో హోమం

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మపూరం సమీపంలో వెలిసిన కురుమూర్తి స్వామి ఆలయంలో పూజారులు ఆదివారం హోమం నిర్వహించారు. రాజగోపురంపై కలశాల ప్రతిష్ఠాపనలో భాగంగా రెండో రోజు దేవతాపూజలు, అభిషేకం, హోమ కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉత్సాహంగా కిక్‌బాక్సింగ్ ఎంపికలు



కిక్‌బాక్సింగ్ ఎంపికల్లో పాల్గొన్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ప్రాంగణంలో జిల్లా స్థాయి కిక్‌బాక్సింగ్ ఎంపికలు నిర్వహించారు. 40మంది విద్యార్థులు మ్యూజికల్ ఫాం , పాయింట్ ఫైట్, కిక్‌లైట్ ఎంపికల్లో పాల్గొన్నట్లు స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులు వచ్చేనెలలో మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు జి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి రవినాయక్, సీనియర్ విద్యార్థులు నవీన్, నిఖిల్, జయదీప్‌సింగ్, రోహిత్, యామిని తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తెలకపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు డాక్టర్ జె.సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని పెద్దూరులో 3వ రోజు పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఎన్‌హెచ్ఎస్ శిబిరంలో భాగంగా గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆరోగ్యం , ఆహారం, ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో వయ్యారిబామ నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలోని రహదారులను శుభ్రం చేశారు. మట్టి నమూనా పరీక్షలు చేశారు. రసాయనాలు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, అధిక దిగుబడి వచ్చేందుకు విత్తుకోవాల్సిన విత్తనాలను సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత, ఎంపీటీసీ సభ్యుడు లింగమయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘీభావ పాదయాత్రకు మద్దతు



సిర్సనగండ్ల అంబేద్కర్ విగ్రహం వద్ద డీఎస్‌పీ నాయకులు

చారకొండ: డీఎస్‌పీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ 10 వేల కి.మీ స్వరాజ్య స్థాపనకు మద్దతుగా మండలంలోని డీఎస్‌పీ ఆధ్వర్యంలో సిర్సనగండ్ల నుంచి చారకొండ వరకు 7 కి.మీ వరకు సంఘీభావ పాదయాత్ర చేపట్టారు. సిర్సనగండ్లలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎస్‌పీ మండల అధ్యక్షుడు విజయ్ మాట్లాడుతూ బహుజనుల రాజ్యస్థాపనకు విశారదన్ మహారాజ్ చేపట్టిన 10 వేల కి.మీ స్వరాజ్య పాదయాత్రకు మద్దతుగా ప్రతి ఒక్కరూ సంఘీబావం తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు మల్లేష్, ఉదయ్, మొగులయ్య, మహిళలు తదితరులు ఉన్నారు.